సాక్షి విశాఖపట్నం


మంగళవారం । 2 । సెప్టెంబర్ । 2025



ప్రజా సమస్యలకు వేగవంతమైన పరిష్కారం 8లో



యోధాస్, పునేరి జట్ల ఘన విజయం 8లో



శ్రీ మూషిక వాహన గణపతిగా శ్రీ సంపత్ వినాయగర్

న్యూస్‌రీల్

వైఎస్సార్ సేవలను స్మరించుకుందాం

- సేవా కార్యక్రమాలు చేపడదాం
- పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు పిలుపు



సాక్షి, విశాఖపట్నం: మహానేత వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా జిల్లాలో వాడవాడలా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు పిలుపునిచ్చారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 16వ వర్ధంతి సందర్భంగా మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంతో పాటు నియోజకవర్గ, వార్డులోని పార్టీ కార్యాలయాల్లో ఆయనకు ఘన నివాళులర్పించాలన్నారు. అలాగే వైఎస్సార్ విగ్రహాల వద్ద ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రక్తదానం, అన్నసమారాధన, పండ్లు, రొట్టెల పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించి, విశాఖ నగరానికి ఆయన చేసిన సేవలను స్మరించుకుందామన్నారు.

అప్పన్న హుండీ ఆదాయం రూ.2.06 కోట్లు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి హుండీ ఆదాయం 28 రోజులకుగాను రూ.2 కోట్ల 6 లక్షల 29 వేల 844 వచ్చినట్లు దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తెలిపారు. సింహగిరిపై యాత్రిక సదన్‌లో సోమవారం స్వామివారి హుండీల ఆదాయం లెక్కించారు. 174.840 గ్రాముల బంగారం, 10.335 కిలోల వెండి లభించినట్లు పేర్కొన్నారు. రోజుకు సరాసరి రూ.7 లక్షల 36 వేల 780 వచ్చినట్టు తెలిపారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన లెక్కింపులో దేవస్థానం ఉద్యోగులు, పలు స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

13న జాతీయ లోక్ అదాలత్

విశాఖ లీగల్: ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలోని అన్ని న్యాయ స్థానాల్లో ఈనెల 13వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు ఒక ప్రకటనలో తెలిపారు. న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్, చెక్ బౌన్స్, బ్యాంకింగ్, మోటార్ ప్రమాదాల నష్టపరిహారాలు, బ్యాంకు, మనీ రికవరీ కేసులు, ల్యాండ్ అక్విజిషన్ కేసులు, కార్మిక, కుటుంబ తగాదాలు (విడాకులు మినహా), పారిశ్రామిక వివాదాలు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు పరిష్కరించుకోవచ్చని వివరించారు. మరిన్ని వివరాలకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, న్యాయ సేవా సదన్, విశాఖపట్నంలో లేదా ఫోన్: 0891-2560414, 2575046, ఇమెయిల్: vskpdlsa@yahoo.com, dsla.vsp@gmail.com అలాగే మండల న్యాయ సేవా సంఘాల్లో సంప్రదించవచ్చని తెలిపారు.


పోర్టును సందర్శించిన నేపాల్ కాన్సుల్ జనరల్



నేపాల్ కాన్సుల్ జనరల్ ఝుక్కా ప్రసాద్‌తో మాట్లాడుతున్న పోర్ట్ డిప్యూటీ చైర్మన్ దుర్గేష్

విశాఖ సిటీ: కోల్‌కత్తాలోని నేపాల్ కాన్సుల్ జనరల్ ఝుక్కా ప్రసాద్ ఆచార్య, ఉప కాన్సుల్ జనరల్ జనక్ రాజ్ భట్టా సోమవారం విశాఖపట్నం పోర్ట్ అథారిటీని సందర్శించారు. పోర్ట్ డిప్యూటీ చైర్‌పర్సన్ దుర్గేష్ కుమార్ దూబే వీరికి స్వాగతం పలికారు. పోర్ట్‌లోని మౌలిక వసతులు, కార్గో హ్యాండ్లింగ్ సామర్థ్యం, ఆధునికీకరణ, యాంత్రీకరణ చర్యలు, కవర్డ్ స్టోరేజ్ సదుపాయాలు, సౌర విద్యుత్ ప్రాజెక్టులు, పారిశ్రామిక అవసరాల కోసం ఎస్టీపీ ద్వారా నీటి పునర్వినియోగం వంటి అంశాలను అధికారులు వివరించారు. అదేవిధంగా పెట్టుబడి అవకాశాలు, దిగుమతి-ఎగుమతుల విస్తరణకు సంబంధించిన మార్గాలపై చర్చించారు.

ఏయూ రిజిస్ట్రార్‌గా రాంబాబు




వీసీ రాజశేఖర్ నుంచి నియామక పత్రాన్ని స్వీకరిస్తున్న రిజిస్ట్రార్ ఆచార్య రాంబాబు

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయం నూతన రిజిస్ట్రార్‌గా సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆచార్యుడు, ఫ్యాకల్టీ అఫైర్స్ డీన్ కె.రాంబాబును నియమిస్తూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆచార్య ధనుంజయరావు రిలీవ్ కావడంతో ఆయన స్థానంలో రాంబాబును నియమించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు రాంబాబుకు ఉత్తర్వులను అందజేశారు. మంగళవారం ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా ఆచార్య రాంబాబును పలువురు అభినందించారు.



ఆధునిక విశాఖ నిర్మాత వైఎస్సార్

- జిల్లా దశ మార్చిన దార్శనికుడు వైఎస్ రాజశేఖరరెడ్డి
- పరిశ్రమలకు ప్రాణం.. ఐటీకి పునాది
- గ్రేటర్ విశాఖ రూపశిల్పి మహానేతే
- జననేత గురుతులు పదిలం
- నేడు వైఎస్సార్ వర్ధంతి



సాక్షి, విశాఖపట్నం: ఒక నాయకుడు వేసే అడుగులు భవిష్యత్ తరాలకు మార్గనిర్దేశం చేస్తాయి. ఒక దార్శనికుడి ఆలోచనలు ఒక ప్రాంతపు రూపురేఖలనే మార్చేస్తాయి. అలాంటి ఓ గొప్ప నాయకుడు, దార్శనికుడే దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి. ఆయన పాలనలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లా అభివృద్ధి, సంక్షేమంలో స్వర్ణయుగాన్ని చూసింది. కేవలం సమస్యలను పరిష్కరించడమే కాదు, భవిష్యత్ అవసరాలను ముందుగానే ఊహించి, ఆధునిక విశాఖ నిర్మాణానికి పటిష్టమైన పునాదులు వేశారు. పరిశ్రమల పునరుజ్జీవం నుంచి ఐటీ విప్లవం వరకు, గిరిజన హక్కుల నుంచి పేదవాడి సొంతింటి కల వరకు.. ప్రతీ రంగంలోనూ ఆయనది చెరగని సంతకం. ఆయన మనల్ని విడిచి 16 ఏళ్లు గడుస్తున్నా.. ఆయన ప్రారంభించిన అభివృద్ధి ఫలాలు నేటికీ విశాఖ ప్రజలకు అందుతూనే ఉన్నాయి. వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా మహానేత జిల్లాకు అందించిన సేవలను మరోసారి గుర్తు చేసుకుందాం.

ఐటీకి పునాది వేసిన దార్శనికుడు



ఐటీ అభివృద్ధి కేవలం హైదరాబాద్‌కే పరిమితం కాకూడదన్న ముందుచూపుతో.. విశాఖను కీలక ఐటీ హబ్‌గా తీర్చిదిద్దాలని సంకల్పించారు. రుషికొండ సమీపంలో ఐటీ సెజ్‌కు స్థలాన్ని కేటాయించి, కంపెనీలకు ప్రోత్సాహకాలు అందించారు. ఆయన దార్శనికతకు ఆకర్షితులైన విప్రో, సత్యం వంటి దిగ్గజ కంపెనీలు విశాఖలో తమ కార్యకలాపాలు ప్రారంభించేందుకు ముందుకు వచ్చాయి. నేటి విశాఖ ఐటీ ప్రస్థానానికి ఆనాడే ఆయన బలమైన పునాది వేశారు.

'గ్రేటర్'హోదా ఆయన చలువే..



ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న 'గ్రేటర్' హోదా కలను వైఎస్సార్ సాకారం చేశారు. 2005 నవంబర్ 22న విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌ను 'మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ)'గా ఉన్నతీకరించారు. దీంతో నగరం 111 చదరపు కిలోమీటర్ల నుంచి 540 చ.కి.మీలకు విస్తరించి, అభివృద్ధికి కొత్త ద్వారాలు తెరుచుకుంది. 2013లో భీమిలి, అనకాపల్లి మున్సిపాలిటీలని విలీనం చేయగా 681.96 చ.కిమీ. విస్తరించింది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో మరో 10 పంచాయతీలను గ్రేటర్‌లో విలీనం చేసి.. 98 వార్డులుగా విస్తరించారు. అలాగే జవహర్‌లాల్ నెహ్రూ జాతీయ పట్టణ పునర్నిర్మాణ పథకం (జేఎన్ఎన్‌యూఆర్ఎం) కింద దేశవ్యాప్తంగా ఎంపికైన 63 నగరాల్లో విశాఖను చేర్చిన ఘనత వైఎస్సార్‌దే. ఆయన చొరవతో ఈ పథకం ద్వారా నగరానికి సుమారు రూ.1,885 కోట్లు మంజూరయ్యాయి. ఆ నిధులతో సింహాచలం-పెందుర్తి బీఆర్‌టీఎస్ కారిడార్లు, ఆశీల్‌మెట్ట ఫ్లైఓవర్, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ (యూజీడీ) వంటి మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు రూపుదిద్దుకున్నాయి.

ఉమ్మడి జిల్లాపై చెరగని ముద్ర




2004 నాటికి ఉమ్మడి విశాఖ జిల్లా పారిశ్రామికంగా సంక్షోభంలో ఉంది. స్టీల్ ప్లాంట్, బీహెచ్‌పీవీ, షిప్‌యార్డ్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలు నష్టాలతో మూసివేత దశకు చేరుకున్నాయి. వైఎస్సార్ ఈ సంస్థల పునరుజ్జీవనానికి చర్యలు చేపట్టారు. నష్టాల్లో ఉన్న స్టీల్ ప్లాంట్‌ను గట్టెక్కించి, రెండో దశ విస్తరించాలని నిర్ణయించారు. భారత్ హెవీ ప్లేట్స్ అండ్ వెసల్స్ (బీహెచ్‌పీవీ)ని బీహెచ్‌ఈఎల్‌లో విలీనం చేసి, దానికి కొత్త జీవం పోశారు. మూతపడే స్థితిలో ఉన్న హిందూస్థాన్ షిప్‌యార్డ్‌ను రక్షణ శాఖలో విలీనం చేసి పునరుద్ధరించారు. అలాగే అచ్యుతాపురం సెజ్, పరవాడ ఫార్మాసిటీ, గంగవరం పోర్టు వంటి కీలక ప్రాజెక్టుల భూసేకరణ సమస్యలను పరిష్కరించి, పారిశ్రామిక ప్రగతికి మార్గం సుగమం చేశారు.

పేద రోగులకు అండ



అంతర్జాతీయ విమానాశ్రయ సర్వీసులను విశాఖ ప్రజలకు పరిచయం చేయాలని వైఎస్సార్ సంకల్పించారు. అనుకున్నదే తడవుగా రూ.100 కోట్లు వెచ్చించి విమానాశ్రయానికి అంతర్జాతీయ హోదా తీసుకొచ్చారు. దీంతో ఒక్క సారిగా విశాఖ విమానాశ్రయానికి అంతర్జాతీయ సర్వీసులు పెరిగాయి. ఉత్తరాంధ్ర ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించే లక్ష్యంతో.. హైదరాబాద్ నిమ్స్ తరహాలో విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్) నిర్మాణానికి 2006లో శ్రీకారం చుట్టగా.. నేడు విశేష సేవలందిస్తోంది. గోదావరి జలాలను విశాఖకు తీసుకొచ్చి.. నగర తాగునీటి సమస్యతో పాటు స్టీల్ ప్లాంట్ పారిశ్రామిక అవసరాలను తీర్చారు. రాజీవ్ గృహకల్ప, జేఎన్ఎన్‌యూఆర్ఎం, వాంబే పథకాల ద్వారా నగర పరిధిలో లక్షకు పైగా ఇళ్లను నిర్మించి.. ఎందరో పేదల సొంతింటి కలను నెరవేర్చారు.

గిరిజనుల ఆశాజ్యోతి



దశాబ్దాలుగా పోడు వ్యవసాయం చేసుకుంటున్న గిరిజనులకు అండగా నిలిచారు. అటవీ హక్కుల గుర్తింపు చట్టం ద్వారా వేలాది గిరిజన కుటుంబాలకు వారు సాగు చేసుకుంటున్న భూములపై హక్కు పత్రాలు అందించి, వారి జీవితాల్లో వెలుగులు నింపారు. ఏజెన్సీలో కాఫీ సాగును ప్రోత్సహించడానికి రూ.144 కోట్లతో ప్రత్యేక ప్రాజెక్టును ప్రారంభించారు. దీని ద్వారా వేలాది మంది గిరిజనులకు స్థిరమైన ఉపాధి లభించింది. ఇలా ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాల ద్వారా విశాఖ ప్రజల మనసుల్లో సుస్థిరమైన స్థానాన్ని సంపాదించుకున్నారు వైఎస్సార్.

ఓపెన్‌లో రిజర్వేషన్లతో అన్యాయం

- జీవో 77 ప్రకారం వర్టికల్ విధానం అమలు చేయలేదని అభ్యర్థుల ఆరోపణ
- కలెక్టరేట్ ఎదుట ఆందోళన



కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న డీఎస్సీ బాధిత అభ్యర్థులు, విదసం ప్రతినిధులు

ఆరిలోవ : డీఎస్సీ-2025లో మెరిట్ ర్యాంకులు సాధించిన అభ్యర్థులు కాల్ లెటర్లు రాకపోవడంతో నిరాశకు గురవుతున్నారు. ఏళ్ల తరబడి కష్టపడి చదివి మంచి ర్యాంక్ సాధించినా ఉద్యోగానికి దూరమవుతున్నామని ఆవేదన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వంలో తమకు అన్యాయం జరుగుతోందని అభ్యర్థులు వాపోతున్నారు. ప్రభుత్వం విడుదల చేసిన జీవో 77 ప్రకారం వర్టికల్ విధానం అమలుకాలేదని గగ్గోలుపెడుతున్నారు. అభ్యర్థులను ఓపెన్ కేటగిరీ నుంచి రిజర్వేషన్‌లోకి దించి రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. డీఎస్సీ రిజర్వేషన్ల కోటాలో కూటమి ప్రభుత్వం కోత విధించింది. దీంతో బాధిత అభ్యర్థులు ఆందోళనకు దిగుతున్నారు. ఇందులో భాగంగా విశాఖ జిల్లాలో మంచి ర్యాంకులు సాధించినప్పటికీ మెరిట్ జాబితా ప్రకారం సర్టిఫికెట్ల పరిశీలనకు కాల్ లెటర్లు రాని సుమారు 20 మంది అభ్యర్థులు విదసం ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌కు చేరుకున్నారు. వారంతా అర్హత కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు. వారికి కాల్ లెటర్లు రాకపోవడంతో వారి వారి ర్యాంకులు, మార్కుల జాబితాతో కూడిన వినతి పత్రాలను జాయింట్ కలెక్టర్‌కు అందించారు. అనంతరం కలెక్టరేట్ ముందు ధర్నాకు దిగారు. కూటమి ప్రభుత్వం తమకు అన్యాయం చేసిందని, జనరల్ కేటగిరీలో ర్యాంకులు సాధించిన వారిని రిజర్వేషన్ కేటగిరీలోకి మార్చడం రాజ్యాంగ విరుద్ధమంటూ నినాదాలు చేశారు. జిల్లాలో ఎస్జీటీ ఓపెన్‌లో 115 పోస్టులు ఉండగా మెరిట్‌లో ఎంపికైన 58 మందిలో 20 మందికిపైగా ఎస్సీ, ఎస్టీలు మంచి ర్యాంకులు సాధించారని.. వారిని ఓపెన్ కేటగిరీ జాబితాలో కాకుండా రిజర్వేషన్ కేటగిరీకి మార్చేశారని.. దీంతో రోస్టర్ ప్రకారం అర్హత కలిగిన 20 మంది రిజర్వ్‌డ్ అభ్యర్థులను అనర్హులుగా ప్రకటించి కాల్ లెటర్లు పంపలేదని వాపోయారు.

ఎస్సీ 'బీ'లో 360 ర్యాంక్ సాధించినా కాల్ లెటర్ పంపలేదు..



నేను ఎస్సీ 'బి' కేటగిరికి చెందిన అభ్యర్థిని. నేను 360వ ర్యాంక్ సాధించారు. 77 జీవో ప్రకారం వర్టికల్ విధానం పాటించకపోవడంతో నాకు అన్యాయం జరిగింది. ఓపెన్‌లో 39వ ర్యాంకర్‌ను ఎస్సీ'బీ' కేటగిరిలోకి మార్చేశారు. దీంతో నా స్థానం కోల్పోయాను. ఉద్యోగానికి దూరం కావాల్సి వచ్చింది.

-శేఖర్‌బాబు, విశాఖ,

195 ర్యాంక్ వచ్చినా..



డీఎస్సీలో 195 ర్యాంక్ సాధించాను. నాది బీసీ 'ఏ' కేటగిరి. మా కేటగిరిలో 10 పోస్టులున్నాయి. బీసీ'ఏ'లో నేను 7వ స్థానంలో ఉన్నాను. ఓపెన్‌లో ఉన్న అభ్యర్థులను బీసీ 'ఏ' కేటగిరిలోకి మార్చడంతో నాకు కాల్ లెటర్ రాలేదు. నా తర్వాత స్థానంలో ఉన్న ముగ్గురు అమ్మాయిలకు మాత్రం కాల్ లెటర్లు వచ్చాయి.

- నరవ రాజేష్, కోరాడ సంతపాలెం, కె.కోటపాడు మండలం

ఓపెన్‌లో 24వ ర్యాంకర్‌ను ఎస్సీ కేటగిరీలోకి మార్చేశారు..



ఎస్సీ కేటగిరీ రిజర్వేషన్‌లో 7 పోస్టులు చూపించారు. నేను ఓపెన్‌లో 149వ ర్యాంక్ సాధించి ఎస్సీ కేటగిరీలో 7వ స్థానంలో ఉన్నాను. కానీ 24 ర్యాంక్ సాధించిన ఓపెన్‌లో ఉన్న వ్యక్తిని ఎస్సీ కేటగిరీలో మార్చారు. దీంతో నా స్థానంలో కిందకి వెళ్లిపోయి ఏడో స్థానం దాటిపోయింది. దానివల్ల నాకు కాల్ లెటర్ రాలేదు. ఓపెన్‌లో ఉన్న ఎస్సీ అభ్యర్థిని రిజర్వేషన్ కేటగిరీలో పెట్టేయడంతో ఏడో స్థానంలో ఉన్న నాకు అన్యాయం జరిగింది. నాకు న్యాయం చేయాలి.

- అనిల్‌కుమార్, అవనాం, భీమిలి

రాజ్యాంగ విరుద్ధంగా డీఎస్సీ నియామకాలు



డీఎస్సీ-2025 నియామకాల్లో రిజర్వేషన్ల విధానం గాడి తప్పింది. కూటమి ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధంగా డీఎస్సీ నియామకాలు జరుపుతోంది. మెరిట్‌లో నిలిచిన ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులను ప్రభుత్వం ఆవేదనకు గురిచేస్తుంది. ఆయా కేటగిరీల అభ్యర్థులు మెరిట్ సాధించనప్పటికీ రిజర్వేషన్ కోటాలోకి మార్చడం జీవో 77కి విరుద్ధం. రోస్టర్‌లో వర్టికల్ విధానంలో రిజర్వేషన్ అమలు చేయాలి.

- డాక్టర్ బూసి వెంకటరావు విదసం ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్,

బీసీ 'ఏ'లో 141వ ర్యాంక్ సాధించినా కాల్ లెటర్ రాలేదు..



నేను బీసీ'ఏ' కేటగిరీకి చెందిన అభ్యర్థిని. ఈ డీఎస్సీలో 141వ ర్యాంక్ సాధించాను. ఓపెన్‌లో 23వ ర్యాంకర్ అయిన బీసీ'ఏ' అభ్యర్థిని బీసీ'ఏ' రిజర్వేషన్ కేటగిరీలో పెట్టారు. దీంతో నా స్థానం వెనుకకు నెట్టేసి కాల్ లెటర్ పంపించలేదు. ఈ విధానం వల్ల నాకు అన్యాయం జరిగింది.

- శీలా అభియాంగో, విశాఖ

పకడ్బందీగా సీఎం పర్యటన ఏర్పాట్లు



జేసీ మయూర్ అశోక్


మహారాణిపేట: ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జేసీ కె.మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో డీఆర్వో బీహెచ్ భవానీ శంకర్, ఇతర అధికారులతో కలిసి సోమవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. మధ్యాహ్నం 2.30 గంటలకు నోవాటెల్‌లో గ్లోబల్ ఫోరం ఫర్ సస్టెయినబుల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈస్ట్ కోస్ట్ మారిటైమ్ లాజిస్టిక్స్ సదస్సుకు ముఖ్యమంత్రి హాజరవుతారన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూసుకోవాలని, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ముందుగా చెక్ చేసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. హెలిప్యాడ్ వద్ద ఏర్పాట్లు చేయాలన్నారు.

డీఎస్సీ రెండో విడత సర్టిఫికెట్ల పరిశీలన నేడు

ఆరిలోవ: డీఎస్సీ-2025 అభ్యర్థుల రెండో విడత సర్టిఫికెట్ల పరిశీలన మంగళవారం మధ్యాహ్నం నుంచి జరుగుతుందని డీఈవో ఎన్.ప్రేమకుమార్ తెలిపారు. గత నెల 28 నుంచి 30 వరకు మూడు రోజుల పాటు మొదటి విడతలో 1,426 మందికి కాల్ లెటర్లు పంపించి, ఉక్కునగరంలోని విశాఖ విమల విద్యాలయంలో సర్టిఫికెట్ల పరిశీలన చేసిన సంగతి తెలిసిందే. వారిలో అభ్యర్థులు ఆప్షన్ల ప్రకారం ఉద్యోగం ఎంపిక చేసుకోగా.. మిగిలిన పోస్టులకు సంబంధించి సుమారు 200 ర్యాంక్‌ల లోపు అభ్యర్థులకు మంగళవారం అదే పాఠశాలలో సర్టిఫికెట్లను పరిశీలిస్తామని వెల్లడించారు. కాల్ లెటర్లు అందిన అభ్యర్థులు మధ్యాహ్నం 12 గంటల నుంచి సర్టిఫికెట్లు, సంబంధిత ధ్రువపత్రాలు, ఫొటోలతో హాజరుకావాలని సూచించారు. ఇందుకోసం కోసం నాలుగు బృందాలను ఏర్పాటు చేశారు.

రైల్వేస్టేషన్‌లో 2.2 కిలోల బంగారం స్వాధీనం

- సరైన బిల్లులు చూపని వ్యక్తులు
- రూ.7 లక్షల జరిమానా విధించిన ఎస్‌జీఎస్టీ అధికారులు



అనధికారికంగా రవాణా చేస్తున్న బంగారం

తాటిచెట్లపాలెం : వాల్తేర్ డివిజన్ క్రైమ్ ప్రివెన్షన్ అండ్ డిటెక్షన్ స్క్వాడ్(సీపీడీఎస్) బృందం సభ్యులు అనధికారికంగా బంగారం రవాణా చేస్తున్న ముఠాను అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం ఉదయం 11.30 సమయంలో సీపీడీఎస్, వాల్తేర్ సభ్యులు ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్, సిబ్బందితో కలిసి రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు గేట్ నెంబర్ 4 వద్ద బ్యాక్‌ప్యాక్ బ్యాగ్‌తో సంచరించడం గమనించి తనిఖీ చేశారు. అందులో మరుధర్ ఎక్స్‌ప్రెస్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్(లాజిస్టిక్ సర్వీస్) పేరిట రెండు కార్టన్ బాక్స్‌లు ఉన్నాయి. వారిని విచారించగా మధ్యప్రదేశ్‌కు చెందిన హరేంద్రసింగ్, రాజస్థాన్‌కు చెందిన హరిగోవింద్‌లని తెలిపారు. వారు ఈ కొరియర్‌ను బ్రహ్మపూర్ నుంచి విశాఖ తీసుకువచ్చినట్లు చెప్పారు. అనుమానించిన ఆర్పీఎఫ్ సిబ్బంది స్టేట్ జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ మంజుల, ఆర్పీఎఫ్ అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ బారుణ్‌కుమార్ బెహరాలకు సమాచారం అందించారు. వారి సమక్షంలో బాక్స్‌లను తెరిచి చూడగా 2.20 కిలోల బంగారం స్వాధీనం ఉంది. దీని విలువ రూ.2.20 కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు. అయితే కొన్ని ఈ ట్యాక్స్ ఇన్‌వాయిస్‌లు ఉన్నాయని, ఇందులో కొన్ని వాస్తవమైనవి కాగా మరికొన్ని నకిలీ పత్రాలని గుర్తించారు. జీఎస్టీ నిబంధనలను అతిక్రమించడంతో రూ.7 లక్షలు జరిమానా విధించారు.

క్యాన్సర్ రహిత రాష్ట్రమే లక్ష్యం

- రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్
- కేజీహెచ్‌లో కాంప్రహెన్సివ్ క్యాన్సర్ సెంటర్ ప్రారంభం



పరికరాలను ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్‌ను క్యాన్సర్ రహిత రాష్ట్రంగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. కేజీహెచ్ క్యాన్సర్ చికిత్సా కేంద్రంలో సుమారు రూ.42 కోట్లతో సమకూర్చిన అధునాతన వైద్య పరికరాలను, స్క్రీనింగ్ యంత్రాలను ఆయన సోమవారం ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఈ నిధులు మంజూరైన విషయం విదితమే. పరికరాల్లో లీనియర్ యాక్సిలరేటర్ (రూ.25 కోట్లు), సిటీ సిమ్యులేటర్ (రూ.9.5 కోట్లు), బ్రాకీథెరపీ (రూ.7.5 కోట్లు) ఉన్నాయి. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ ఇప్పటి వరకు ఇక్కడ సరైన సదుపాయాలు లేకపోవడం వల్ల, క్యాన్సర్ రోగులు ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సి వచ్చేదన్నారు. ఇక నుంచి కేజీహెచ్‌లో ఆధునిక చికిత్సలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. కేజీహెచ్‌తోపాటు కర్నూలులో కూడా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, దీనికి గాను కేంద్రం ఇప్పటికే నిధులు కూడా కేటాయించిందని వివరించారు. క్యాన్సర్ లక్షణాలున్న వారిని గుర్తించేందుకు త్వరలో ప్రత్యేక సర్వే చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, పి.విష్ణుకుమార్ రాజు, ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ వైస్ చైర్మన్ సీతంరాజు సుధాకర్, స్థానిక కార్పొరేటర్ అప్పలరత్నం, డీఎంఈ డాక్టర్ రఘునందన్, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, అడ్మినిస్ట్రేటర్ బీవీ రమణ, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి, సీఎస్ ఆర్ఎంవో డాక్టర్ శ్రీహరి, ఆంకాలజీ విభాగం వైద్యాధికారులు పాల్గొన్నారు.

క్యాన్సర్ వల్ల ముగ్గురు కుటుంబ సభ్యులను కోల్పోయాను

క్యాన్సర్ మహమ్మారి వల్ల తమ కుటుంబంలో ముగ్గురు వ్యక్తులను కోల్పోయానని వైద్య కళాశాల సెంటినరీ భవనంలో వైద్య విద్యార్థులు, వైద్యులతో జరిగిన మీట్-గ్రీట్‌లో మంత్రి సత్యకుమార్ భావోద్వేగానికి గురయ్యారు. అమ్మ, సోదరుడు, అక్క వేర్వేరు సమయాల్లో ప్రాణాలు విడిచారని వివరించారు. ఈ ఘటనలు తనను ఎంతగానో కలచివేశాయన్నారు.

5న డీఎస్ఎన్ఎల్‌యూ సమష్టి స్నాతకోత్సవం



వీసీ సూర్యప్రకాశరావు

సబ్బవరం: దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయ(డీఎస్ఎన్ఎల్‌యూ) సమష్టి స్నాతకోత్సవాన్ని ఈ నెల 5న విశాఖలో నిర్వహించనున్నట్లు వర్సిటీ వీసీ ఆచార్య డాక్టర్ సూర్య ప్రకాశరావు తెలిపారు. తెలియజేసారు. వర్సిటీ సమావేశమందిరంలో సోమవారం మీడియాకు వివరాలు తెలిపారు. విశాఖలోని నోవోటెల్‌లో ఆ రోజు ఉదయం 11 గంటలకు విశ్వవిద్యాలయ 8, 9, 10, 11, 12వ స్నాతకోత్సవాలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమానికి సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రసంగిస్తారని పేర్కొన్నారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తి, వర్సిటీ విజిటర్ జస్టిస్ పి.శ్రీనరసింహ, సుప్రీం కోర్టు న్యాయమూర్తి, వర్సిటీ పూర్వ వీసీ జస్టిస్ జేకే మహేశ్వరి ప్రత్యేక అతిథులుగా హాజరుకానున్నట్లు వెల్లడించారు. వర్సిటీ ప్రస్తుత చాన్సలర్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ అధ్యక్షతన జరిగే ఈ స్నాతకోత్సవానికి రాష్ట్ర ఐటీ, విద్యాశాఖామంత్రి నారా లోకేష్ గౌరవ అతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు. అదే రోజు సబ్బవరంలోని వర్సిటీ క్యాంపస్‌లో అకడమిక్ బ్లాక్–2లో ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఇతర కొత్త భవనాల ప్రారంభోత్సవం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మా గాంధీ, దామోదరం సంజీవయ్య విగ్రహాల ఆవిష్కరణ ఉంటుందన్నారు.

మైనర్‌పై ఇన్‌స్టాలో తప్పుడు ప్రచారం చేస్తున్న నిందితుడి అరెస్ట్

విశాఖ సిటీ : మైనర్ బాలికను ఇన్‌స్టాగామ్‌లో కాల్ గర్ల్ అని ప్రచారం చేస్తూ వేధిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. నగరానికి చెందిన మైనర్ బాలిక ఫొటోను ఎడిట్ చేసి కాల్ గర్ల్ అని చిత్రీకరించి గుర్తు తెలియని ఒక ఇన్‌స్టాగామ్ అకౌంట్ నుంచి స్టోరీలు పెట్టారు. అవి చూసి భయానికి గురైన బాలిక తన తల్లితో కలిసి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సాంకేతికత సహాయంతో ఇన్‌స్టాగామ్‌లో తప్పుడు ప్రచారం చేస్తున్నది సొంత అక్క భర్త అని తెలుసుకున్నారు. వారి కుటుంబంపై ద్వేషంతో తప్పుడు ప్రచారం చేసినట్లు తెలుసుకున్నారు. దీంతో అతడిని అరెస్టు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు.

ప్రజా సమస్యలకు వేగవంతమైన పరిష్కారం

జేసీ మయూర్ అశోక్ ఆదేశాలు

మహారాణిపేట: ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో అందిన దరఖాస్తులను 24 గంటల్లోపు పరిశీలించి, వాటి పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. సమస్యలను పూర్తి స్థాయిలో విచారణ చేసి, సంతృప్తికరమైన, నాణ్యమైన పరిష్కారం చూపాలని సూచించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి ఆయన దరఖాస్తులు స్వీకరించారు. వారితో ముఖాముఖిగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా సమస్యలను పరిష్కరిస్తామని వారికి హామీ ఇచ్చారు. సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు మొత్తం 328 వినతులు అందాయి. వాటిలో రెవెన్యూ శాఖకు 98, పోలీసు శాఖకు 23, జీవీఎంసీకి 81, ఇతర విభాగాలకు సంబంధించి 126 వినతులు ఉన్నాయి. కార్యక్రమంలో డీఆర్వో భవానీ శంకర్, జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ వర్మ, లపు విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి ఆగిన పింఛన్

'బతికి ఉండగానే చంపేశారు' అని కుమార్తెల ఆవేదన



ఈమె పేరు మళ్ల అప్పలనరసమ్మ. జీవించి ఉన్న ఈమెను ప్రభుత్వ రికార్డుల్లో చనిపోయినట్లు నమోదు చేయడం వల్ల నెలవారీ పెన్షన్ ఆగిపోయింది. ఈ ఘటనపై ఆమె కుమార్తెలు బి.లీల, ఎ.వరలక్ష్మి తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జ్ఞానాపురం సబాస్టియన్ కాలనీలో నివసించే మళ్ల అప్పలనరసమ్మ గతంలో నెలవారీ పెన్షన్ పొందేవారు. అయితే గత కొన్ని నెలలుగా ఆమెకు పెన్షన్ నిలిచిపోయింది. దీనిపై సచివాలయాన్ని సంప్రదించగా, ఆమె పేరుపై కారు ఉన్నట్లు రికార్డులు చూపిస్తోందని, అందువల్ల పెన్షన్ నిలిచిపోయిందని సిబ్బంది వివరించారు. ఈ సమస్య పరిష్కారం కోసం ఆమె కుమార్తెలు గత కొన్ని నెలలుగా కలెక్టరేట్‌లో జరుగుతున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేస్తున్నారు. తాజాగా.. ఆధార్ కార్డుకు అటాచ్ అయిన కారు వివరాలను తొలగించినప్పటికీ, ఇప్పుడు ఆమె చనిపోయినట్లుగా రికార్డుల్లో చూపిస్తోందని వారు ఆరోపిస్తున్నారు. 'పింఛను అడిగితే చంపేస్తారా?' అని ప్రశ్నిస్తున్నారు. తమ తల్లిని చూసుకునే దిక్కు లేదని, పింఛను వస్తే ఆమె బతకగలదని వాపోయారు. దయచేసి తమ తల్లికి పెన్షన్ తిరిగి ఇప్పించాలని వారు అధికారులను వేడుకుంటున్నారు.

రాజకీయ కారణాలతో రేషన్ కార్డుల కుదింపు

డిపో డీలర్ ఆవేదన



గత 12 ఏళ్ల రేషన్ డిపో మీద ఆధారపడి జీవిస్తున్నానని, రాజకీయాల కారణంగా తన డిపోలో కార్డుల సంఖ్యను ఆకస్మికంగా తగ్గించారని ఏవీఎన్ కాలేజీ డౌన్ 265 నంబర్ డిపో డీలర్ బుద్ధవరపు లలిత నారాయణరావు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో 932 మంది కార్డుదారులు ఉండేవారని, ఇప్పుడు 634 కార్డులకు కుదించారని ఆయన వాపోయారు. అంతేకాకుండా, అనేక వివాదాల్లో ఉండే వ్యక్తుల కార్డులను తన డిపోలో చేర్చడం వల్ల ఇబ్బందులు పడుతున్నానని తెలిపారు. ఈ విషయంపై అధికారులకు చాలాసార్లు వినతులు సమర్పించినప్పటికీ, ఎటువంటి స్పందన లేదని, అందుకే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేస్తున్నానని పేర్కొన్నారు. తనకు గతంలో ఉన్న అన్ని కార్డులను తిరిగి కేటాయించాలని ఆయన కోరారు.

తప్పుడు కుల ధ్రువీకరణ పత్రంతో ఉద్యోగం

ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

సీతమ్మధార అసిస్టెంట్ ట్రెజరీ కార్యాలయంలో తప్పుడు కుల ధ్రువీకరణ పత్రంతో ఉద్యోగం చేస్తున్న సుజాతపై చర్యలు తీసుకోవాలని అక్కిరెడ్డిపాలేనికి చెందిన పోలిపిరెడ్డి సంతోష్‌కుమార్ సోమవారం ప్రజా ఫిర్యాదుల వేదికలో ఫిర్యాదు చేశారు. గతంలో కూడా పలుమార్లు ఈ విషయంపై ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. సుజాత బీసీ–డీ రిజర్వేషన్ కిందకు వస్తుందని, కానీ ఎస్సీ సర్టిఫికేట్‌తో ఉద్యోగం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. దీనిపై తగు చర్యలు తీసుకోవాలని సంతోష్ కోరారు.

టౌన్‌ప్లానింగ్ విభాగానికి అత్యధిక ఫిర్యాదులు



కమిషనర్‌తో కలిసి ఫిర్యాదులు స్వీకరిస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పట్టణ ప్రణాళికా విభాగానికి అత్యధికంగా 44 ఫిర్యాదులు అందాయి. మేయర్ పీలా శ్రీనివాసరావు, జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ వినతులు స్వీకరించారు. మొత్తం 106 ఫిర్యాదులు అందగా, వాటిలో పట్టణ ప్రణాళికా విభాగానికి 44 ఫిర్యాదులు వచ్చాయి. అడ్మినిస్ట్రేషన్ అండ్ అకౌంట్స్ విభాగానికి 11, రెవెన్యూ సెక్షన్‌కు 11, ప్రజారోగ్య విభాగానికి 2, ఇంజనీరింగ్ సెక్షన్‌కు 34, మొక్కల విభాగానికి ఒకటి, యూసీడీ విభాగానికి 3 ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో ప్రధాన ఇంజనీర్ పీవీవీ సత్యనారాయణరాజు, అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి, ప్రధాన వైద్యాధికారి నరేష్ కుమార్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, ఫైనాన్స్ అండ్ అడ్వైజర్ మల్లికాంబ, సీసీపీ ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

విదేశీయుడికి పాస్‌పోర్ట్ అప్పగింత



విదేశీ నేవీ అధికారికి పాస్‌పోర్టును అందజేస్తున్న సీపీ

విశాఖ సిటీ: నగరంలో విదేశీయుడు పోగొట్టుకున్న పాస్‌పోర్టును గుర్తించి నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి చేతుల మీదుగా సోమవారం అందజేశారు. దక్షిణాఫ్రికా దేశానికి చెందిన నేవీ అధికారి పోజెఫ్ జాన్సన్ వాన్ రెన్స్‌బర్గ్ విధుల రీత్యా విశాఖలో ఐఎన్ఎస్ శాతవాహనకు వచ్చారు. ఈ క్రమంలో పాస్‌పోర్టును పోగొట్టుకున్నారు. దీంతో సదరు నేవీ అధికారి నేరుగా పోలీస్ కమిషనరేట్‌కు వచ్చి విషయాన్ని చెప్పారు. వెంటనే సీపీ స్పందించి పాస్‌పోర్టు గుర్తించాలని స్పెషల్ బ్రాంచ్ పోలీసులను ఆదేశించారు. దీంతో పోలీసులు గాజువాక ప్రాంతంలో పాస్‌పోర్టును గుర్తించారు. సీపీ చేతుల మీదుగా నేవీ అధికారికి అందజేశారు. కాగా.. పోలీస్ సమావేశ మందిరంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు మొత్తం 110 ఫిర్యాదులు వచ్చాయి.

హోంగార్డు పోస్టులకు నోటిఫికేషన్

విశాఖ సిటీ: హోంగార్డు బి–కేటగిరీ(టెక్నికల్, ఇతర ట్రేడ్)లో నాలుగు పోస్టుల భర్తీకి నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సోమవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. విశాఖకు చెందిన పురుష, మహిళా అభ్యర్థులు అర్హులని తెలిపారు. అభ్యర్థులు 21 నుంచి 50 ఏళ్లలోపు ఉండాలని, గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఫోరెన్సిక్ సైన్స్‌లో డిప్లమో/డిగ్రీ/పీజీ డిగ్రీ (ఫోరెన్సిక్ సైన్స్)లో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని పేర్కొన్నారు. అభ్యర్థులు ఈ నెల 30వ తేదీలోగా పోలీస్ కమిషనరేట్ ఆఫీస్‌లో దరఖాస్తును సమర్పించాలని సూచించారు. అక్టోబర్ 3, 4 తేదీల్లో దరఖాస్తుల పరిశీలన, 12వ తేదీన రాత పరీక్ష ఉంటుందన్నారు. దరఖాస్తు చేసిన అభ్యర్థులకు ఫోరెన్సిక్ సైన్స్‌కు సంబంధించి 75 మార్కులతో గంటన్నర పాటు రాత పరీక్ష ఉంటుందన్నారు. ఇందులో ఉత్తీర్ణత సాధించిన వారికి రూ.710 రోజువారీ వేతనం వస్తుందన్నారు.

కేకే లైన్‌లో యథావిధిగా రైళ్ల రాకపోకలు

తాటిచెట్లపాలెం: కేకే లైన్‌లో యథావిధిగా రైళ్ల రాకపోకలు సాగిస్తాయని వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలతో గూడ్స్ రైలు పట్టాలు తప్పిన కారణంగా ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్ల గమ్యాన్ని కుదించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో పునరుద్ధరణ పనులు పూర్తి చేశామని, విశాఖ- కిరండూల్- విశాఖ నైట్ ఎక్స్‌ప్రెస్, పాసింజర్ రైళ్లు యథావిధిగా రాకపోకలు సాగిస్తాయని డీసీఎం వెల్లడించారు.

జీవీఎంసీ ప్రధాన ఇంజనీర్‌గా సత్యనారాయణరాజు



డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన ఇంజనీర్‌గా పీవీవీ సత్యనారాయణరాజు సోమవారం ప్రధాన కార్యాలయం ఇంజనీరింగ్ విభాగంలో బాధ్యతలు స్వీకరించారు. ప్రధాన ఇంజనీర్‌గా ప్రభుత్వం పదోన్నతి కల్పిస్తూ జీవీఎంసీలోనే పోస్టింగ్ కల్పించిందని, ఎంతో బాధ్యతగా విధులు నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి మౌలిక వసతుల కల్పనకు నిత్యం కృషి చేస్తానని సత్యనారాయణ రాజు పేర్కొన్నారు. నగర మేయర్, జీవీఎంసీ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసినట్లు చెప్పారు.

ఏఆర్‌టీ, ఐవీఎఫ్ సెంటర్ల రిజిస్ట్రేషన్ తప్పనిసరి

మహారాణిపేట: విశాఖ నగర, గ్రామీణ ప్రాంతాల్లోని సంతాన సాఫల్య కేంద్రా(ఏఆర్‌టీ)లు, ఐవీఎఫ్ సెంటర్లు సరోగసీ యాక్ట్–2021 ప్రకారం తప్పనిసరిగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం(డీఎంహెచ్‌వో)లో ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలని, లేకుంటే చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. విశాఖ జిల్లాలో అనుమతి పొందిన ఏఆర్‌టీ లెవెల్–1 కేటగిరీలో 10 కేంద్రాలు, లెవెల్ 2లో 23 కేంద్రాలు, ఏఆర్‌టీ బ్యాంకులు 11 ఉన్నాయి. వీటిలో రెన్యువల్ చేసుకోనివి, కొత్తవి కూడా ఆన్‌లైన్‌లో వెంటనే రిజిస్టర్ కావాలని డీఎంహెచ్‌వో సూచించారు.

అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నేడు

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని బోటనీ విభాగంలో అతిథి అధ్యాపక పోస్టులను భర్తీ చేయనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో పీజీలో ఫస్ట్ క్లాస్ ఉన్న అభ్యర్థులు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆసక్తి గల అభ్యర్థులు మంగళవారం జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు. నెట్, సెట్, పీహెచ్‌డీ ఉన్న వారికి ప్రాధాన్యం ఉంటుంది. మరిన్ని వివరాల కోసం 81065 43229 నంబర్‌ను సంప్రదించవచ్చు.

ఐటాప్ అధ్యక్షుడిగా ఇంద్రజిత్

ఏయూక్యాంపస్: ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఐటాప్) 2025–27 సంవత్సరానికి కొత్త కార్యవర్గం ఎన్నికైంది. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఇంద్రజిత్ అన్నే, కార్యదర్శిగా శ్రీధర్ సరగడం, కోశాధికారిగా అనుపమ ఎన్నికయ్యారు. వార్షిక కార్యవర్గ అధ్యక్షుడిగా దాసరి కిశోర్‌ను ఎన్నుకున్నారు. ప్రస్తుత అధ్యక్షురాలు ముక్కవల్లి లక్ష్మి వార్షిక నివేదికను సమర్పించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ఇంద్రజిత్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ఐటీ సంస్థలను ప్రోత్సహించడం, ఉద్యోగ అవకాశాల కల్పనకు ప్రణాళికలు సిద్ధం చేయడం తమ ప్రధాన లక్ష్యాలని చెప్పారు.

సెగలు కక్కుతున్న కాలుష్యం



భారీ స్థాయిలో నురుగులు కక్కుతున్న కలుషిత నీరు

కొమ్మాది: మారికవలస, కొమ్మాదిలో గల కొన్ని సీ ఫుడ్స్ కంపెనీలు కలుషిత నీరును నేరుగా వదిలి వేయడంతో మారికవలస–కాపులుప్పాడ గెడ్డలోకి కలిసిపోతుంది. దీంతో నీరు కలుషితమవ్వడమే కాకుండా దుర్వాసన వెదజల్లుతుంది. సోమవారం ఉదయం ఈ గెడ్డ వద్ద భారీ ఎత్తులో కలుషిత నీరు నురుగులు కక్కుతున్న దృశ్యమే దీనికి సాక్ష్యం. ఈ కలుషిత నీరు సమీపంలో పంట పొలాలతో పాటు నగరపాలెం నుంచి ప్రవహించే గెడ్డలో కలిసిపోవడంతో తీర ప్రాంతం కూడా కలుషితమవుతుందని ఇక్కడ వారు వాపోతున్నారు. ఈ రసాయనిక కలుషిత నీటి వల్ల చుట్టు పక్కన పంట పొలాలు నాశనమవుతున్నాయని.. దుర్వాసన వెదజల్లుతుందని.. చర్మవ్యాధులు ప్రభలుతున్నాయని స్థానికులు వాపోతున్నారు.

మృత్యువాత పడుతున్న జీవరాశులు

కలుషిత నీరు నేరుగా గెడ్డ నుంచి సముద్రంలోకి కలవడంతో ఇక్కడ నీరు అంతా కలుషితం అవుతుంది. దీంతో సముద్రంలో చేపలు, తాబేళ్లు వంటివి మృత్యువాత పడి తీరానికి కొట్టుకొస్తున్నాయి. ఈ కలుషిత నీటి ప్రభావం ఉప్పాడ నుంచి తిమ్మాపురం బీచ్ వరకు ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని ఇక్కడ మత్స్యకారులు కోరుతున్నారు.

యోధాస్, పునేరి జట్ల ఘన విజయం



తలపడుతున్న పునేరి పల్టన్, గుజరాత్ జెయింట్స్

విశాఖ స్పోర్ట్స్: నగరంలోని పోర్టు స్టేడియంలో ప్రో కబడ్డీ 12వ సీజన్ ఉత్కంఠభరితంగా సాగుతోంది. సోమవారం జరిగిన మ్యాచ్‌ల్లో యూపీ యోధాస్, పునేరి పల్టన్ జట్లు అద్భుత విజయాలు సాధించాయి. ఉత్కంఠభరితంగా సాగిన తొలి మ్యాచ్‌లో యూపీ యోధాస్ 34–31 పాయింట్ల తేడాతో పాట్నా పైరేట్స్‌పై విజయం సాధించింది. చివరి నిమిషాల్లో అద్భుతంగా పుంజుకున్న యోధాస్.. పాట్నాను ఓడించి వరుసగా రెండో గెలుపును నమోదు చేసింది. ఏకపక్షంగా సాగిన మరో మ్యాచ్‌లో పునేరి పల్టన్ 41–19 పాయింట్ల భారీ తేడాతో గుజరాత్ జెయింట్స్‌పై విజయకేతనం ఎగురవేసింది. ఈ ఓటమితో గుజరాత్ జెయింట్స్ వరుసగా రెండో పరాజయాన్ని చవిచూసింది. విశాఖలో జరుగుతున్న ఈ జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు స్థానిక యువ క్రీడాకారుల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపుతున్నాయి. మంగళవారం రాత్రి 8 గంటలకు దబాంగ్ ఢిల్లీ, బెంగళూర్ బుల్స్, రాత్రి 9 గంటలకు జైపూర్ పింక్ పాంథర్స్, పాట్నా పైరేట్స్ జట్లు తలపడనున్నాయి.

లులూకి భూ కేటాయింపు రద్దు చేయాలి

- విశాఖ ప్రజా వనరుల పరిరక్షణ వేదిక డిమాండ్



మాట్లాడుతున్న వేదిక చైర్మన్ రాణిశర్మ

డాబాగార్డెన్స్ : విశాఖ సాగర తీరంలో లులూకి 13.74 ఎకరాల అత్యంత ఖరీదైన ప్రభుత్వ భూమిని కేటాయించడాన్ని విశాఖపట్నం ప్రజా వనరుల పరిరక్షణ వేదిక తీవ్రంగా తప్పుబట్టింది. ఈ మేరకు సోమవారం నగరంలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టింది. వేదిక చైర్మన్ రాణిశర్మ మాట్లాడుతూ ప్రైవేట్ వ్యక్తులకు రాష్ట్రంలో అత్యంత ఖరీదైన భూములు పందేరాన్ని తప్పుబట్టారు. తక్షణమే లులూకి భూమిని కేటాయిస్తూ ఇచ్చిన జీవో రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ, సీపీఐ నాయకుడు చలసాని రాఘవేంద్రరావు మాట్లాడుతూ కూటమి సర్కార్ అధికారం చేపట్టిన తర్వాత నగరంలోని ప్రభుత్వ భూములను కార్పొరేట్ శక్తులకు అప్పనంగా కట్టబెడుతోందని పేర్కొన్నారు. సీఆర్‌జెడ్ నిబంధనలను ఉల్లంఘించి సాగర తీరంలోని 13.74 ఎకరాల భూమిని లులూకు ఎలా కేటాయిస్తారని నిలదీశారు. కార్పొరేటర్ ఏజే స్టాలిన్, వేదిక కన్వీనర్ సీఎస్ క్షేత్రపాల్, ఆర్‌కేఎస్‌వీ కుమార్, వెంకటలక్ష్మితో పాటు పౌర, ప్రజా సంఘాలు, కార్మిక, మహిళ, యువజన, విద్యార్థి, దళిత, సంఘాలతో పాటు వార్డు, నివాస సంఘాల ప్రతినిధులు లులూ మార్ట్‌కు ఇచ్చిన అన్ని రకాల అనుమతులు రద్దు చేయాలని ఏకగ్రీవ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆ భూమిలో సైన్స్ మ్యూజియం నిర్మించి భావితరాలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్ఎస్ మాధవి, వనజాక్షి, మన్మధరావు, మణి, అష్రాఫ్, రాంబాబు, నాగభూషణం, అప్పారావు, బీబీ గణేష్ పాల్గొన్నారు.

పుట్టిన రోజునే మృత్యు ఒడికి..

- పెందుర్తిలో రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకుడి మృతి
- పుట్టెడు దుఃఖంలోనూ కుమారుడి నేత్రాలు దానం చేసిన తల్లిదండ్రులు



సుబ్రహ్మణ్యం(ఫైల్)



సుబ్రహ్మణ్యం నేత్రాలను దానం చేసేందుకు అంగీకారం తెలుపుతున్న తండ్రి శ్రీనివాసరావు

పెందుర్తి: కాయ కష్టం చేసుకుని బతుకుతున్న కుటుంబం. కొడుకు చేతికి అందొస్తున్నాడు. చదువు పూర్తి చేసుకుని కష్టాలు గట్టెక్కిస్తాడని ఆశపడుతున్న సమయంలో విధి ఆ కుటుంబాన్ని చిన్నచూపు చూసింది. రోడ్డు ప్రమాదం రూపంలో కొడుకును మృత్యువు కాటేసింది. పుట్టినరోజు నాడే అందని లోకాలకు తీసుకుపోయింది. అయితే అంతటి విషాదంలోనూ వారిలో మానవత్వం పరిమళించింది. మరణించిన తమ కుమారుడి నేత్రాలను దానం చేసి మరో నలుగురి జీవితాల్లో వెలుగులు నింపారు.

పెందుర్తిలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చినముషిడివాడకు చెందిన కేశబోయిన సుబ్రహ్మణ్యం(21) చికిత్స పొందుతూ సోమవారం వేకువజామున మృతి చెందాడు. స్థానిక పెద్ద చెరువు వద్ద బైక్ ఆటో ఢీకొన్న ఘటనలో సుబ్రహ్మణ్యంతో పాటు మరో ముగ్గురు తీవ్రంగా గాయపడిన సంగతి తెలిసిందే. మిగిలిన వారికి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపినట్లు పోలీసులు వెల్లడించారు.

తీరని విషాదం

చినముషిడివాడకు చెందిన కేసుబోయిన శ్రీనివాసరావు, రాములమ్మ దంపతులకి సుబ్రహ్మణ్యం(21), పుణ్యకేశ్వరి సంతానం. శ్రీనివాసరావు కూలి పనులకు వెళుతుంటాడు. రాములమ్మ స్థానికంగా టిఫిన్ బండి నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. సుబ్రహ్మణ్యం సబ్బవరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆఖరి సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం సుబ్రహ్మణ్యం పుట్టినరోజు కావడంతో రాత్రి స్నేహితుడితో కలిసి కొత్తవలస వైపు బైక్‌పై వెళుతున్నాడు. ఈ క్రమంలో పెందుర్తి పెద్ద చెరువు వద్ద ఆటోను ఢీకొని తీవ్ర గాయాలపాలై సోమవారం ఉదయం మృతి చెందాడు. దీంతో ఆ కుటుంబంతో పాటు చినముషిడివాడ ప్రాంతంలో తీవ్ర విషాదం అలముకుంది.

నలుగురి జీవితాల్లో వెలుగులు

మృతి చెందిన సుబ్రహ్మణ్యం నేత్రాలను దానం చేయాల్సిందిగా తల్లిదండ్రులు శ్రీనివాసరావు, రాములమ్మను పెందుర్తి సాయి హెల్పింగ్ హ్యాండ్స్ ట్రస్ట్ ప్రతినిధి దాడి శ్రీనివాస్ కోరగా వారు వెంటనే అంగీకారం తెలిపారు. 'చేతికందిన కొడుకే మాకు లేకుండా పోయాడు. అలాంటిది వాడి కళ్ళు నలుగురి వెలుగునిస్తాయంటే మాకు అభ్యంతరం ఏముంటుంది'అంటూ అంగీకరించారు. అయితే కేజీహెచ్ మార్చురీ వద్ద సుబ్రహ్మణ్యం మృతదేహం ఉండడం.. తల్లిదండ్రులు చినముషిడివాడలో ఉండడంతో న్యాయబద్ధంగా నేత్రాలను సేకరించే అవకాశం లేకపోయింది. ఆలస్యం అయితే నేత్రాలు సేకరించినా ఉపయోగం లేని పరిస్థితి. ఈ క్రమంలో చొరవ తీసుకున్న పెందుర్తి సీఐ కేవీ సతీష్‌కుమార్ వెంటనే తండ్రి శ్రీనివాసరావును కేజీహెచ్‌కు తీసుకువెళ్లాలని ఏఎస్ఐ కాశీ ప్రసాద్‌కు చెప్పడంతో హుటాహుటిన అక్కడకు వెళ్లి అంగీకార పత్రంపై సంతకం చేశారు. దీంతో మోహిషిన్ ఐబ్యాంక్ ప్రతినిధులు నేత్రాలు సేకరించారు.

92 శాతం పింఛన్ల పంపిణీ



పెదజాలారిపేటలో పింఛన్ల కోసం వేచి ఉన్న లబ్ధిదారులు

మహారాణిపేట: జిల్లాలో ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. రాత్రి 7 గంటల సమయానికి సుమారు 92 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయినట్లు డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ లక్ష్మీపతి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,60,445 పింఛన్ల కోసం ప్రభుత్వం రూ.70 కోట్ల నిధులు విడుదల చేసింది. వీటిలో సోమవారం రాత్రి 7 గంటల సమయానికి 1,48,089 మంది లబ్ధిదారులకు రూ. 58.85 కోట్లు పంపిణీ చేశారు. ఈ నెల కూడా పలు ప్రాంతాల్లో ఇంటి వద్ద కాకుండా.. సచివాలయాల వద్ద పంపిణీ చేపట్టారు. జీవీఎంసీ పరిధిలో 26,638 మందికి గాను 24,842 మందికి, గ్రామీణ ప్రాంతాల్లో 1,33,807 మందికి గాను 1,23,247 మందికి పింఛన్లు అందాయి. మిగిలిన పింఛన్లను మంగళవారం సచివాలయాల వద్ద పంపిణీ చేస్తామని పీడీ లక్ష్మీపతి తెలిపారు.

ముగ్గురు సీఐలకు చార్జిమెమోలు?

రౌడీషీటర్ల వ్యవహారంలో సీపీ సీరియస్

అల్లిపురం/తాటిచెట్లపాలెం: నగరంలో రౌడీ షీటర్లు మరోసారి బరితెగించారు. ప్రతి ఆదివారం పోలీస్ స్టేషన్లలో కౌన్సెలింగ్ ఇస్తున్నప్పటికీ వారిలో మార్పు రావడం లేదు. ప్రతిరోజూ ఏదో ఒక చోట తమ ఆధిపత్య పోరును ప్రదర్శిస్తూనే ఉన్నారు. తాజాగా, పేకాట ఆడుతూ తలెత్తిన వివాదంలో ఓ రౌడీ షీటర్‌పై ప్రత్యర్థి వర్గం హత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటనపై తీవ్రంగా స్పందించిన నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి.. శాంతిభద్రతల పర్యవేక్షణలో విఫలమయ్యారంటూ ముగ్గురు సీఐలకు చార్జిమెమోలు జారీ చేయాలని ఆదేశించినట్లు సమాచారం. వివరాలివి. ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రైల్వే క్వార్టర్స్‌లో శనివారం రాత్రి పలువురు రౌడీ షీటర్లు పేకాట ఆడారు. ఈ క్రమంలో వారి మధ్య తలెత్తిన వివాదం తీవ్ర ఘర్షణకు దారితీసింది. ఖాజా అనే రౌడీ షీటర్‌పై మరో వర్గానికి చెందిన రౌడీ షీటర్, అతని అనుచరులు ఇనుప రాడ్లు, కర్రలతో విచక్షణారహితంగా దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన ఖాజాని ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని డీఆర్ఎం కార్యాలయం సమీపంలో పడేసి, అతని వద్ద ఉన్న నగదును దోచుకుని పరారయ్యారు. అటుగా వెళ్తున్న ఓ ఆటో డ్రైవర్ గమనించి బాధితుడిని కేజీహెచ్‌కు తరలించారు. గత మూడు రోజులుగా టూటౌన్, ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో రౌడీ షీటర్ల ఆగడాలు మితిమీరడంతో నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. తాజా ఘటన నేపథ్యంలో రౌడీ షీటర్లను అదుపు చేయడంలో విఫలమయ్యారని ఫోర్త్‌టౌన్ సీఐ ఉమాకాంత్‌తో పాటు టూటౌన్, కంచరపాలెం సీఐలకు కూడా చార్జిమెమోలు ఇవ్వాలని ఆయన ఆదేశించినట్లు తెలిసింది. ఇప్పటికే ఫోర్త్‌టౌన్ సీఐ చార్జిమెమో తీసుకున్నట్లు తెలిసింది.